క్లుప్తంగా

23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మునగపాక: మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 23న జరగనుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఈవోపీఆర్డీగా చలపతిరావు



నక్కపల్లి: స్థానిక ఈవోపీఆర్డీగా కె.చలపతిరావు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేసిన సత్యనారాయణ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఆనందపురం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న చలపతిరావును పదోన్నతిపై నక్కపల్లి ఈవోపీఆర్డీగా నియమించారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. చలపతిరావును ఎంపీడీవో సీతారామరాజు, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచ్‌లు అభినందించారు. పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు చేపడతానని చలపతిరావు తెలిపారు.

సర్వే వేగవంతం కావాలి

మునగపాక: మండలంలోని పాటిపల్లిలో జరుగుతున్న సర్వే వేగవంతం కావాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం సాయంత్రం వీఆర్వోలు, సర్వేయర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటిపల్లి రెవెన్యూ పరిధిలో పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం సర్వే చేపడుతుందన్నారు. ఇందుకోసం ఇరువురు సమన్వయం చేసుకుంటూ సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ భూమి ఎంత మేర ఉంది.. జిరాయితీ భూముల వివరాలు సేకరించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న బుజ్జి

నక్కపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నక్కపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. గురువారం నక్కపల్లి నుంచి ఉపమాక వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవడం, ప్రాణవాయువు కాపాడు కోవడం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. విషవాయువులు, గాలినుంచి ప్రాణాలను కాపాడుకోవడానికి మొక్కలను సామాజిక బాధ్యతగా తీసుకుని నాటాల్సిన అవసరం ఉందన్నారు.

ఎస్.రాయవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా నాగేశ్వరరావు

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా ఉప్పరాపల్లి మాజీ సర్పంచ్ తుమ్మపాల నాగేశ్వరరావు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అబద్ధం, కందుల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న నారుమళ్లలో రక్షణ చర్యలు

ఎస్.రాయవరం: ఎండుతున్న నారుమళ్లను మరికొన్ని రోజులు కాపాడుకునేందుకు రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సౌజన్య గురువారం సూచించారు. విత్తనాలు చల్లిన తరువాత సుమారు 16 రోజులు వర్షాలు అనుకూలించకపోవడంతో నారుమడులు ఎండుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం నారుమడులతో నీరు లేక వాడిపోయినట్టుగా ఉన్నాయన్నారు. 19-19-19, 13-0-45 పొటాషియం నైట్రేట్‌లలో ఒక లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కలిపి సాయంత్ర సమయాల్లో పిచికారీ చేయడం వల్ల చనిపోయిన నారును మరో వారం రోజుల పాటు కాపాడుకోవచ్చని చెప్పారు.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లకు సన్మానం

నక్కపల్లి: మండలంలో మూడు పీఏసీఎస్‌లకు ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఒక్కొక్క పీఏసీఎస్‌కు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. వీరిలో ఒకరిని పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. నక్కపల్లి పీఏసీఎస్‌కు కొప్పిశెట్టి బుజ్జి, వేంపాడు పీఏసీఎస్‌కు వెలగా శ్రీనివాసరావు, గొడిచర్ల పీఏసీఎస్‌కు దార్ల కృష్ణను నియమించారు. వారిని గురువారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కొప్పిశెట్టి వెంకటేష్, పలువురు సీనియర్ నాయకులు ఘనంగా సన్మానించారు.

దారులు దారుణం.. ప్రయాణం నరకం.!

- అధ్వానంగా దర్శనమిస్తున్న పల్లె రహదారులు
- అడుగడుగునా గుంతలతో అవస్థలు
- కూటమి నేతల ఎన్నికల హామీ బుట్టదాఖలు


సంక్రాంతి కల్లా గుంతల్లేని రహదారులే తమ లక్ష్యమని ఎన్నికల ముందు ఊకదంపుడు ప్రచారం చేసిన కూటమి నేతలు చేతల్లో చూపించకుండా చేతులెత్తేశారు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు అసలే అంతంత మాత్రంగా ఉన్న పలు ప్రాంతాల్లోని రహదారులు మరింత ఛిద్రంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు, కొండవాలు ప్రాంతాల్లోని రోడ్ల పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. గోతులతో నిండిన రోడ్లు కొన్ని అయితే.. రాళ్లు తేలిపోయిన రహదారులు మరికొన్ని. ఛిద్రంగా మారిన ఆయా రహదారుల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలతో రహదారులు నిర్మించారు. గోతుల రోడ్లను కూడా బాగు చేసే క్రమంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చేయడంతో పనులు చేపట్టలేకపోయారు. కూటమి హయాంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా అధ్వాన రహదారులే దర్శనమిస్తున్నాయి. గోతులమయమైన రోడ్ల గురించి పట్టించుకునే పాలకులు, అధికారులే కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

మునగపాక

రాళ్లు తేలిన మోడల్ స్కూల్ రోడ్డు

పాటిపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రాళ్లు తేలిపోయాయి. మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థులతో పాటు స్థానికులు రాకపోకలు సాగించేందుకు నిత్యం అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై రాళ్లు దర్శనమిస్తుండడంతో ప్రయాణం ఇబ్బందికరంగా తయారైంది. అటు పరవాడ, ఇటు మునగపాకకు వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఆపసోపాలు పడుతూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

అధ్వానంగా దర్శనమిస్తున్న పాటిపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారి



గోతులమయం.. నాగవరం రహదారి



గోతులమయంగా నాగవరానికి వెళ్లే రోడ్డు

గ్రామానికి వెళ్లే రహదారి గోతులమయంగా తయారైంది. మునగపాక నుంచి నాగవరం మీదుగా అటు అచ్యుతాపురం, పరవాడ వంటి ప్రాంతాలకు నిత్యం వందలాదిగా ప్రయాణం సాగిస్తుంటారు. నాగవరానికి వెళ్లే రోడ్డు గుంతలతో నిండిపోయింది. వర్షాకాలంలో గోతుల్లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. గోతులు కారణంగా వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

మునగపాక రోడ్డుకు మోక్షమెప్పుడో?

పూడిమడక రోడ్డు నుంచి మునగపాకకు వెళ్లేందుకు ఏళ్ల క్రితం రోడ్డు నిర్మించారు. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం ఈ రోడ్డు శిథిలావస్థకు చేరింది. రాకపోకలకు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో రహదారిపై నీరు నిలిచిపోతుంది.

శిథిలావస్థలో మునగపాక ప్రధాన రోడ్డు



శిథిల రోడ్డుతో అవస్థలు



మునగపాకలో ఏళ్లకాలం నాటి ప్రధాన రహదారి శిథిలావస్థకు గురైంది. ఈ రహదారిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు దృష్టి సారించి శిథిల రహదారికి మోక్షం కలిగించాలి.

– ఆడారి కాశీబాబు, మాజీ వార్డు సభ్యులు, మునగపాక

రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు

రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోతుల రహదారుల అభివృద్ధికి సంబంధించి ఎంత ఖర్చు అవుతుందనే వివరాలతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. ప్రాధాన్యత క్రమంలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

– పద్మిని, ఏఈ, ఆర్‌అండ్‌బీ

యాదగిరిపాలెం వాసుల పాట్లు



మెలిపాక శివారు యాదగిరిపాలెం వెళ్లేందుకు నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రహదారి పొడవునా గోతులే దర్శనమిస్తున్నాయి. వర్షాకాలంలో గోతుల్లో నీరు నిలిచిపోవడంతో పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. రాత్రి సమయంలో గోతుల్లో పడిపోతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఇటీవల కురిసిన వర్షాలకు యాదగిరిపాలెంలో గోతుల్లో నిలిచిపోయిన వర్షపు నీరు

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



సమావేశంలో నాయకులతో మాట్లాడుతున్న సమన్వయకర్త ధర్మశ్రీ

అచ్యుతాపురం రూరల్ : వైఎస్సార్‌సీపీ రాంబిల్లి మండలం విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. తన ఇంటి వద్ద పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ధర్మశ్రీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కిషోర్ రాజు, ఎంపీపీ శిరీష శ్రీనుబాబురాజు, గిరిబాబు, జెడ్పీటీసీ నాగరాజు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

తూరలు కాజేసేందుకు యత్నం!

కోటవురట్ల: తూరలకు కాళ్లొచ్చాయి. అవి ఓ చోట నుంచి మరో చోటకు వెళ్లి కూర్చున్నాయి. అవును నిజమే వరాహనదిలో ఉన్న తూరలు ఒడ్డెక్కాయి. అక్కడి నుంచి మరో చోటకు మాయం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నాయి. రూ.లక్షలు విలువ చేసే తూరలు నదిలో నుంచి బయటకు వచ్చాయి. జల్లూరు శివారు వరాహనదిలో పాత వంతెన శిథిలం కావడంతో కొత్త వంతెన నిర్మించే క్రమంలో గత ప్రభుత్వంలో తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు వేశారు. పెద్ద తూరలతో రూ.40 లక్షలు వెచ్చించి డైవర్షన్ రోడ్డును నిర్మించారు. ప్రస్తుతం కొత్త వంతెనపై రాకపోకలు జరుగుతుండగా డైవర్షన్ రోడ్డులో వేసిన తూరలపై అక్రమార్కుల కన్ను పడింది. నదిలోని 13 తూరలను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రి నది ఒడ్డుకు చేర్చారు. ఇవి ఒక్కొక్కటి సుమారు రూ.25 వేలు ఖరీదు చేస్తాయని స్థానికులు చెబుతున్నారు. వీటిని నెమ్మదిగా తరలించుకుపోయేందుకు రంగం సిద్ధం చేశారు. అధికారులు పట్టించుకోకపోతే ఒడ్డుకు చేరిన తూరలు మాయమయ్యే అవకాశం ఉంది. అయితే అధికారుల అండదండలతోనే ఈ తూరలు నదిలో నుంచి బయటకు చేరాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ నారాయణరెడ్డిని వివరణ కోరగా.. తూరలు నదిలో నుంచి బయటకు తీసిన సంగతి తనకు తెలియదని, పరిశీలించి ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నదిలో ఉన్న తూరలు నది ఒడ్డుకు చేరిన దృశ్యం

‘నీటి తీరువా కోసం నోటీసులు సరికాదు’




డీటీ మురళీధర్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మునగపాక: నీటి తీరువా బకాయిలు చెల్లించాలని రైతులకు నోటీసులు పంపించడం తగదంటూ రైతు సంఘ నేతలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత రెండు రోజులుగా మునగపాక పంచాయతీ పరిధిలోని రైతులకు నీటి తీరువాలు చెల్లించాలని కోరుతూ నోటీసులు పంపారు. విషయం తెలుసుకున్న రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్ ఇతర కార్యవర్గ సభ్యులు గురువారం డీటీ మురళీధర్‌ను కలిసి సమస్య రాకుండా చూడాలని కోరారు. మునగపాకలో నీటి తీరువా చెల్లించడానికి అసలు నీటి పారుదల ఎక్కడ అమలవుతుందని, కేవలం రెండు నెలల పాటు మాత్రమే కాలువల్లో నీరు వస్తుందని, మిగతా నెలల్లో నీటి ప్రవాహం ఉండదన్నారు. ఇందుకు స్పందించిన ఆయన సమస్యను తహసీల్దార్ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ ప్రతినిధులు దాడి శివ, టెక్కలి కొండలరావు, విల్లూరి నూకనరసింగరావు, ఆడారి శ్రీకాంత్, ఆడారి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: మండలంలో ఎస్.రాయవరం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. చెట్టుకొమ్మలు, తీగల మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉప్పరాపల్లి, కర్రివానిపాలెం, లింగరాజుపాలెం, బసవపాడు, సైతారుపేట, సర్వసిద్ధి, వాకపాడు, పెదగుమ్ములూరు సబ్‌స్టేషన్ పరిధిలో చినగుమ్ములూరు, పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, నీలాద్రిపురం, పేదబోదిగల్లం, పెద దొడ్డిగల్లు, రామకృష్ణాపురం, సీతంపాలెం తదితర గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.


వైఎస్సార్‌సీపీ ఎస్.రాయవరం మండల స్థాయి సమావేశం నేడు



బొలిశెట్టి గోవిందరావు

ఎస్.రాయవరం: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంపై శుక్రవారం అడ్డురోడ్డులో వైఎస్సార్‌సీపీ ఎస్.రాయవరం మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా హాజరు కావాలన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి కన్నబాబురాజు తోటలో ఈ సమావేశం ఉంటుందన్నారు.

ప్రయాణికుల సౌకర్యాల కల్పనకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం ధీరజ్

గొలుగొండ : కృష్ణదేవిపేట(ఏఎల్‌పురం) బస్ స్టేషన్ పరిధిలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా కాంప్లెక్సు ముందు భాగంలో సీసీ ర్యాంప్ నిర్మాణం చేయడం జరిగిందని నర్సీపట్నం ఆర్టీసీ డీఎం ధీరజ్ తెలిపారు. కృష్ణదేవిపేట బస్ కాంప్లెక్సు పరిధిలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఆర్టీసీ పరంగా కావాల్సిన మౌలిక సదుపాయాలు స్థానికుల నుంచి డీఎం అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ లోచల సుజాత మాట్లాడుతూ కాంప్లెక్సు పరిధిలో ప్రయాణికులకు తాగునీటి సమస్య ఉందన్నారు. ఎంపీపీ పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్సు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కాంప్లెక్సు పరిధిలో రూ.6 లక్షలతో సీసీ ర్యాంప్ వేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎంఎస్‌ఎం రావు, ఎంపీటీసీ సభ్యులు చింతల బుల్లిప్రసాద్, బొడ్డు జమీలు, చిటికెల చిట్టిబాబు పాల్గొన్నారు.

కక్ష సాధింపుతోనే అక్రమ కేసులు



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



‘బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ’క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

- మాజీ సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి అనితకు లేదు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త జోగులు

పాయకరావుపేట: రాష్ట్రంలో కక్ష సాధింపుతో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు ధ్వజమెత్తారు. పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు అధ్యక్షతన పెంటకోట అమృత గార్డెన్‌లో ‘బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ’కార్యక్రమం పేరిట గురువారం పార్టీ మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి హోంమంత్రి అనితకు లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో 143 హామీలు ఇచ్చిందని, సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర ప్రజల్ని చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోసం చేస్తున్నారన్నారు. అధికారం చేపట్టి 16 నెలలు గడిచినా విద్యా, వైద్యం , అన్నదాత సుఖీభవ, తదితర సంక్షేమ పథకాలు అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలంతా గుర్తించాలన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్లి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చేస్తున్న మోసపూరిత పాలనను ఎండగట్టాలన్నారు. తప్పు చేయకపోయినా సరే వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు మాట్లాడుతూ రైతులు, మహిళలను మోసం చేస్తూ పాలన సాగించడం చంద్రబాబుకు అలవాటని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి శ్రీనివాసరావు, సకిలేటి రాము, పన్నీరు బాబ్జి, పడాల దివాణం, మేడిశెట్టి రామగోవిందు, చేపల నాగమణి తాతాజీ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కె.కె.ఆర్.ఎస్.లత, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దేవవరపు రాజేష్ ఖన్నా, పార్టీ జిల్లా కార్యదర్శులు దేవవరపు వెంకటేశ్వరరావు, యజ్జల అన్నవరం, గుజ్జు గోవిందరావు, ఎంపీటీసీలు గారా చక్రవర్తి, తమ్మిర్సి శేఖర్, కొంతం నరేష్, మాజీ సర్పంచ్ తమ్మిర్సి గంగారావు, నాయకులు పల్లేల వెంకట్, తూము రాజుబాబు, పెనుమత్స నాగేశ్వరరావు, నీలాపు చిరంజీవి రెడ్డి, నీలాపు బాలకృష్ణారెడ్డి, పిరాధి రాజు, పాలపర్తి సతీష్, మహిళా నాయకులు పులి సీతారత్నం, బొడ్డా శ్రీదేవి, అడపా శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో అవస్థలు

మునగపాక: మండల వ్యాప్తంగా గురువారం ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. గత వారం రోజులుగా ఎండ తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే చాలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు హడలెత్తిపోతున్నారు. వర్షాలు కురిస్తాయని ఆశించే ప్రజలు ఉక్కపోతను చూసి ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రైతులు విత్తనాలు జల్లేందుకు ఉపక్రమిస్తున్నా వర్షాలు లేక వెనుకంజ వేస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మునగపాక: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ కోరారు. మునగపాక బైపాస్ రోడ్డులో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించాలన్నారు. పురుషులతో సమానంగా మహిళలు కూడా ఆదాయం పెంపునకు పాటుపడాలన్నారు.

ప్రణాళికతోనే లక్ష్య సాధన




రామచంద్రపురంలో విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి లక్ష్మి

కోటవురట్ల: విద్యార్థులు పెద్ద లక్ష్యాలను ఏర్పరుచుకుని సాధించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని హెచ్‌ఎం డి.దేవి సూచించారు. రామచంద్రపురం ఎంపీయూపీ స్కూల్‌లో దాతల సహకారంతో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి యు.లక్ష్మి విద్యార్థులకు చేయూతనివ్వాలని భావించారు. వెంటనే బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, బాక్సులు, క్రీడా సామగ్రిని కొనుగోలు చేసి అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో మంచి స్థాయికి ఎదిగి మరికొంత మందికి ఉపకారం చేసేలా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామమూర్తి, సత్యనారాయణ, జె.వి.ప్రసాదరావు, మాధవి పాల్గొన్నారు.

తంగేడులో రేపు ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ’

కోటవురట్ల: తంగేడులో ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ’కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. తంగేడులోని మాజీ ఎమ్మెల్యే ఆర్‌ఎస్ కృష్ణమూర్తిరాజు ఇంటి ఆవరణలో సాయంత్రం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ, కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు డి.వి.సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్‌ఎస్ సీతారామరాజు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, జిల్లా పార్టీ కమిటీ సభ్యులు, పార్టీ అనుబంధ విభాగాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

మళ్లీ ఎంపీపీ ఎన్నిక వాయిదా



ఎన్నిక నిర్వహణకు ఎదురుచూస్తున్న మనోరమ

ఎస్.రాయవరం: మండలంలో ఎంపీపీ ఎన్నిక రెండో రోజు కూడా వాయిదా పడింది. గత నెలలో ఎంపీపీ వెంకటలక్ష్మి రాజీనామా చేయడంతో ప్రభుత్వం ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బుధ, గురువారాల్లో ఎన్నికకు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి మనోరమ ఏర్పాట్లు చేశారు. రెండో రోజు కూడా ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో తదుపరి నోటిఫికేషన్ వచ్చిన తరువాత ఎన్నిక నిర్వహిస్తామని చెప్పారు.